# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ:  14-05-2026                                    సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ న్యూఢిల్లీ వేదికగా ఈరోజు ప్రారంభమయిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సదస్సుకి హాజరైన సభ్య దేశాల మంత్రులు ఈ మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు.

- ❖ 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో SIR మూడో దశ ఈ నెల 30 నుండి ప్రారంభం కానుందని ఎన్నికల సంఘం ప్రకటించింది.

- ❖ భారతదేశానికి చమురు తీసుకువస్తున్న రెండు ఎల్పీజీ క్యారియర్లు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయని ప్రభుత్వం వెల్లడించింది.

- ❖ ఉత్తరప్రదేశ్‌లో గత 24 గంటల్లో కురిసిన భారీ వర్షాలు, భీకర గాలులు, పిడుగుల కారణంగా 89 మంది ప్రాణాలు కోల్పోయారు.

- ❖ ఈశాన్య రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను ఈ నెల 16 నాటికి తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది.

===========================

బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సదస్సు న్యూ ఢిల్లీలోని భారత్ మండపం వేదికగా ఈరోజు ప్రారంభమయ్యింది. ఈ సదస్సుకి హాజరైన సభ్య దేశాల విదేశాంగ మంత్రులు ఈ మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. వారిలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి రోనాల్డ్ లామోలా, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వీరా తదితరులు ఉన్నారు. అంతకుముందు, భారత్ విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా చేసిన ప్రారంభోపన్యాసంలో జైశంకర్ మాట్లాడుతూ... సైనిక ఘర్షణలు, ఆర్థిక అనిశ్చితులు, వాణిజ్య అవరోధాలు, సాంకేతికత సవాళ్లు, వాతావరణ మార్పులు ప్రపంచ స్వరూపాన్ని మార్చేస్తున్న ప్రస్తుత తరుణంలో ఈ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. ప్రపంచ, ప్రాంతీయ పరిణామాలపై సమీక్షించుకోవడానికి, ఈ సంక్లిష్ట పరిస్థితుల్లోనూ పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునే ఆచరణాత్మక మార్గాలను అన్వేషించడానికి ఈ

సదస్సులో జరిగే చర్చలు అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. అంతర్జాతీయ సంక్షోభాల నివారణలో బ్రిక్స్ కూటమి నిర్మాణాత్మకమైన పాత్రను పోషించగలదని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 27సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడో దశకు సంబంధించి ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీ, ఒడిశా, మిజోరం, సిక్కిం, మణిపూర్, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, తెలంగాణ, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, దాద్రానగర్ హవేలి, డామన్ డయ్యూలో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ  ఈనెల 30న నుండి ప్రారంభంకానుందని తెలిపింది. అయితే.. హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, లద్దాఖ్ ప్రాంతాల్లో వాతావరణ ప్రతికూల పరిస్తుతులను దృష్టిలో ఉంచుకుని ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. ఇక ఎస్ఐఆర్ మూడో దశలో భాగంగా 3 లక్షల 94 వేల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు  (BLO)లు ఇంటింటికీ వెళ్లి దాదాపు 36 కోట్ల 73 లక్షల మంది ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. వీరికి సహకరించేందుకు రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా BLOలను నియమించాలని ఎన్నికల సంఘం కోరింది. ఓటర్లందరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని, తమ గణన పత్రాలను పూరించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశానికి చమురు తీసుకువస్తున్న రెండు ఎల్పీజీ  క్యారియర్లు హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటాయని ప్రభుత్వం వెల్లడించింది. అవి వరుసగా మే 16, 18వ తేదీలలో కాండ్లా, న్యూ మంగళూరు ఓడరేవులకు చేరుకుంటాయని కేంద్ర షిప్పింగ్, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముఖేష్ మంగళ్ తెలిపారు. న్యూ ఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోమాలియా నుండి యూఏఈలోని షార్జాకు ప్రయాణిస్తున్న భారత వాణిజ్య నౌక “ఎంఎస్‌వి హాజీ అలీ” నిన్న తెల్లవారుజామున ఒమన్ జలాల్లో ఒక ప్రమాదానికి గురైందని చెప్పారు. నౌకలో మంటలు చెలరేగడంతో అది మునిగిపోయినట్లు సమాచారం అందిందని తెలిపారు. నౌకలోని 14 మంది భారతీయ సిబ్బందిని ఒమన్ కోస్ట్ గార్డ్ రక్షించిందని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇక మరోవైపు దేశవ్యాప్తంగా ఎల్పిజి సరఫరా సజావుగా సాగుతోందని, ఏ పంపిణీ కేంద్రంలోనూ సరఫరా నిలిచిపోయినట్లు నివేదికలు లేవని, రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పని చేస్తున్నాయని పెట్రోలియం సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా రేపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ UAE వెళ్తారు. పర్యటనలో భాగంగా యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తో సమావేశమవుతారు. భారత్, యూఏఈల భాగస్వామ్యాన్ని  బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో చర్చలు జరుపుతారు. UAE పర్యటన అనంతరం ప్రధానమంత్రి నెదర్లాండ్స్ చేరుకుంటారు. 2017 పర్యటన తర్వాత ప్రధానమంత్రి నెదర్లాండ్స్‌లో పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్ కింగ్ విల్లెం-అలెగ్జాండర్, క్వీన్ మాక్సిమాలను ప్రధాని కలుస్తారు. ఆతరువాత స్వీడన్, నార్వే, ఇటలీ దేశాలలో పర్యటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్ లో గత 24 గంటల్లో కురిసిన భారీ వర్షాలు, భీకర గాలులు, పిడుగుల కారణంగా 89 మంది ప్రాణాలు కోల్పోగా 100 మందికి పైగా గాయపడ్డారు. ప్రయాగ్‌రాజ్ జిల్లాలో అత్యధికంగా 21 మంది మృతి చెందారు. భదోహిలో 16 మంది మరణించారు. గాలివాన బీభత్సానికి పలు జిల్లాలలో భారీ ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. పలు ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. ఈ అకాల వర్షాల వల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై సమీక్ష నిర్వహించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మృతుల కుటుంబాలకు 24 గంటల్లోపు ఆర్థిక సహాయం అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF) కేవలం 20 ఏళ్ల స్వల్ప వ్యవధిలోనే దేశంలోని 140 కోట్ల మంది ప్రజల నమ్మకాన్ని గెలుచుకుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఘజియాబాద్ లో జరిగిన NDRF ప్రెసిడెంట్స్ కాలర్ అవార్డు ప్రధానోత్సవంలో  ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్  షా  మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఎక్కడ విపత్తు సంభవించినా NDRF సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోగానే ప్రజలు ఊపిరి పీల్చుకుంటారని పేర్కొన్నారు. ఏ దళానికైనా ప్రెసిడెంట్స్ కాలర్ గౌరవాన్ని అందుకోవడం అనేది ఎంతో గర్వకారణమని అన్నారు. NDRF తో పాటు SDRF, పంచాయతీలు, రాష్ట్ర యంత్రాంగం, NCC, NSS, సేవలో నిమగ్నమైన వేలాది మంది `ఆపద మిత్రుల` విపత్తు సహాయక చర్యలను రాష్ట్రపతి ఏకకాలంలో గుర్తించారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం కనీస ప్రాణనష్టం నుండి సున్నా ప్రాణనష్టం వైపు తీసుకువెళుతోందని అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చక్కెర ఎగుమతులను తక్షణం నిలిపివేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశీయంగా చక్కెర ధరలు పెరగకుండా, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ జనరల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ముడి చక్కెర, శుద్ధి చేసిన చక్కెరలకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని తెలిపింది. అయితే అమెరికా, యూరప్ తో పాటు ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్న మరి కొన్ని దేశాలకు ఎగుమతులు జరుగుతాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే 2, 3 రోజుల్లో ఢిల్లీ, చండీగఢ్, హర్యానా, బీహార్, చత్తీస్‌గఢ్, పంజాబ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం IMD తెలిపింది. అదే విధంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో తీవ్ర వేడి గాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక ఈశాన్య ఋతుపవనాలు దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను ఈ నెల 16 నాటికి తాకే అవకాశం ఉందని IMD శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ వెల్లడిస్తూ..

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =